క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి, జంగేడు 33/11కేవీ సబ్ స్టేషన్‌లో పరిధిలో మరమ్మత్తులు కారణంగా నేడు (శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖఏఈ కె.విశ్వాస్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని తెలిపారు.

విద్యుదాఘాతంతో లేగదూడ మృతి



చిట్యాల: విద్యుదాఘాతంతో లేగదూడ మృతి చెందిన సంఘటన మండలంలోని కాల్వపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాల్వపల్లి గ్రామంలోని పంచిక రాజయ్యకు చెందిన లేగదూడ గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

మాజీ సర్పంచ్ మృతి


మొగిలి (ఫైల్)

చిట్యాల: మండలంలోని జడలపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొట్ల మొగిలి (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. జడలపేట గ్రామానికి చెందిన మొగిలి 2014 స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్‌గా పోటి చేసి గెలుపొందాడు. మొగిలి గత కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతిడికి భార్య, రాధమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా మొగిలి మృతిపై జడలపేట సర్పంచ్ కామిడి రత్నాకర్‌రెడ్డి తో పాటు గ్రామస్తులు బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ కేసులు



శాయంపేట : ప్రకృతిలో స్వేచ్ఛగా జీవించే వన్యప్రాణులను వేటాడితే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య హెచ్చరించారు. ఐఎఫ్ఎస్ లావణ్య, ఎఫ్ఆర్‌వో భిక్షపతి ఆదేశాల మేరకు మండలంలోని శాయంపేట, పత్తిపాక గ్రామాల్లోని పాత నేరస్తుల ఇళ్లలో స్నేర్స్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఫారెస్ట్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. పక్షులు, జంతువులను వేటాడానికి వినియోగించే జాలీలు, వలలు, ఉచ్చులను స్వాధీనం చేసుకొని హనుమకొండలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. వేటగాళ్లు తమ ఇళ్లలో వన్యప్రాణులను వేటాడేందుకు వినియోగించే వలలు ఉచ్చులు పాతవైనప్పటికీ ఇళ్లలో ఉంచుకోకూడదని అన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు రతన్లాల్, బండి బలరాం, పాడెం సుగుణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం బత్తిని రాజేందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 06న కాజీపేటలోని సెయింట్ గాబ్రియెల్ గ్రేండ్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ 17లో బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్ సాకేత్, ఎం మల్లికార్జున్, పి లక్ష్మి, సిహెచ్ శ్వేత, జి అభినవవర్షిని, వై అక్షయ ఎంపికై నట్లు తెలిపారు. ఈ నెల 8,9,10 వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం బాదేపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను, పీఈటీ సుధాకర్‌ను సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ఎంపీటీసీ నాగయ్య, మాజీ సర్పంచ్ తోట స్రవంతి, నాగరాజు, ఉప సర్పంచ్ శివాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిషోర్ అభినందించారు.

శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కరిత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయిశృతి, లహరి, సానియాకాశ్ర, అర్పిత ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు.

రైతులకు తప్పని తిప్పలు


మహాముత్తారం: నల్లబడి నేలరాలుతున్న పత్తి


చిట్యాల: దెబ్బతిన్న పత్తి పంట

- మిచాంగ్ తుపానుతో పంటల నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

చిట్యాల/మహాముత్తారం: పంట దిగుబడి వచ్చే సమయంలోనే రైతుపై ప్రకృతి కన్నెర్ర చేయడంతో పంటలను కాపాడుకోలేక కర్షకులు ఆగమాగమవుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికచ్చే సమయంలోనే వర్షార్పణం కావడంతో రైతులు చేసేదిలేక కన్నీరు మున్నీరవుతున్నారు. రైతులు వేసిన పంటలకు ప్రకృతి వాతావరణంలో మార్పుల మూలంగా అనేక తిప్పలు పడుతున్నారు. ప్రతి ఏట పంటలు చేతికందే సమయంలో ఎదో రూపంలో ప్రళయతాండవంలా రైతులకు నష్టం వాటిల్లుతూనే ఉంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపాను కారణంగా రైతులు వేసిన పత్తి, మిరప, వరి పంటలు దెబ్బతిన్నాయి. మరికొంత మంది రైతులు వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించినప్పటికీ ధాన్యం తడిసి ముద్దయింది. మిర్చికి తెగులు రావడంతో పాటు పూత రాలిపోవడంతో దిగుబడి రాదని ఆందోళన చెందుతున్నారు. పత్తి చేలల్లోని పత్తి తడిసి నల్లబడి నేల రాలిపోతుంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ అకాల వర్షంతో కోతలు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన అందరిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఎనమిది ఎకరాల్లో పత్తి, ఐదు ఎకరాలలో మిర్చి పంట వేశాను. పత్తి పంట వర్షం కారణంగా పూర్తిగా తడిసి పోయింది. దింతో పెట్టిన పెట్టుబడి వస్తుందనే కమ్మకం లేదు. మిరప పంట వర్షం మూలంగా దెబ్బతింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– పిట్టల రమేష్, రైతు, చిట్యాల

మంత్రులను కలిసిన నాయకులు


ములుగు: మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గోవిందరావుపేట: నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, జాగర్లమూడి నాగేశ్వరరావు ఉన్నారు.

ములుగు: మంత్రి ధనసరి సీతక్కను జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లతో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మడుగురి నాగేశ్వర్‌రావు, ఏళ్ల మధుసూదన్, అన్నవరం రవికాంత్, గుల్లగట్టు సంజీవ, హట్కర్ సమ్మయ్య, మంకిడి రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సీతక్కను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల నాయకులు కలిశారు. పెద్ది నరసింహారావు, భగవాన్ రెడ్డి, గూడెబోయిన సురేష్, చిట్యాల పురుషోత్తం, ఆకు పవన్, సిద్దబత్తుల జగదీష్, తాలుక సంపత్, భగవాన్ రెడ్డి, సతీష్, వల్లెపల్లి శివప్రసాద్ ఉన్నారు.


గోవిందరావుపేట: సీతక్కను కలిసిన నాయకులు

ఎమ్మెల్యే గండ్రను కలిసిన కత్తి సంపత్


ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో కత్తి సంపత్

టేకుమట్ల: నూతన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు కత్తి సంపత్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, మరింత ముందుకు తీసుకుపోవాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట టేకుమట్ల, మొగుళ్లపల్లి కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన గండ్ర సత్యనారాయణరావును మండలంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పులబొకే అందించారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకోడెపాక సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, నాయకులు భాస్కర్, రమేష్, కృష్ణమూర్తి, ప్రకాష్, శంకర్, అమరేందర్‌రెడ్డి, వేణు, శ్రీనివాస్, నాగరాజు, విష్ణు, మల్లికార్జున్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర ఖజానాను లూటీ చేసిన కేసీఆర్'

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ లూటీ చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మండలంలోని కొప్పుల, మైలారం గ్రామాల్లో ఓ వేడుకకు హాజరై అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. నేడు మధ్యాహ్నం 2గంటలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం, 10లక్షలతో ఆరోగ్యశ్రీ రెండు గ్యారెంటీ పథకాలను అమలు కానున్నాయని పేర్కొన్నారు. మండలంలోని వాగవతలి గ్రామాలైన సాధోనిపల్లి, రాజుపల్లి గంగిరేణిగూడెం గ్రామాల్లో ఆర్టీసీ సర్వీస్ కల్పించేందుకు రీజినల్ మేనేజర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

వైద్య సిబ్బందికి అవగాహన


అవగాహన కల్పిస్తున్న నరేష్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108వాహనంలో నియోనేటల్ సేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుస్మిత, 108 కోఆర్డినేటర్ నరేష్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. నియోనేటల్ ద్వారా అత్యాధునిక టెక్నాలజీతో 108 వాహనాల్లో అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి మూడు సంవత్సరాల పిల్లల వరకు నియోనేటల్ ద్వారా శ్వాస సంబంధిత అనారోగ్య సమస్యలకు మెరుగైన వైద్యం అందించుటకు జిల్లాల నుంచి హైదరాబాద్ వరకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఎవరైన ఆస్పత్రిలో (హెచ్ఎఫ్ఎస్)అనారోగ్యంతో చనిపోతే పట్టణాల నుంచి ఇంటికి చేర్చుటకు 108లను వినియోగించుకోవాలని వివరించారు.

విద్యార్థులను బాల మేధావులుగా తీర్చిదిద్దాలి


డ్రాయింగ్ చాట్‌లను చూపిస్తున్న విద్యార్థులు

శాయంపేట : బాలలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి బాలమేధావులుగా తీర్చిదిద్దాలని యూనిట్ మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఆర్థిక సాయంతో ఎఫ్‌పీసీఎల్ బీసీఐ ప్రాజెక్టు ద్వారా బాల కార్మికుల నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 14సంవత్సరాల్లోపు పిల్లలతో పనులు చేయించొద్దని అన్నారు. విద్యార్థులను విద్యకు దూరం చేసి పనులు చేపిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పురుగు మందు పిచికారి చేసేటప్పుడు చిన్న పిల్లలు పంట పొలాల్లో ఉండొద్దని, పురుగుమందు డబ్బాలకు దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం బాల, బాలికలకు స్టాఫ్ చైల్డ్ లేబర్ అనే కన్సెప్ట్ పై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు డిక్షనరీ, స్పోకెన్ ఇంగ్లిష్ బుక్కులు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, విజయ్, శారద, వసంత, ఫీల్డ్ ఫెసిలిటర్లు కుక్కల కల్పన, పోతు సునీల్, తిరుపతి పాల్గొన్నారు.

గోవులను సంరక్షించుకోవాలి

వేలేరు : గోవుల సంరక్షణతోనే రైతులకు మనుగడని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని లోక్యతండాలో శుక్రవారం శివశంకర్ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు ఉచితంగా 20 కోడె దూడలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంపద రోజురోజుకు తగ్గిపోతుందని, దీంతో రైతులకు కూడా ఇబ్బందేనని అన్నారు. అధిక రసాయన ఎరువుల వాడకంతో భూసారం, పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. గోవుల పెంపకంతో ఆవుపేడ, గో మూత్రంతో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురావత్ అనురాధ లింగం, గోశాల సూపరిండెంట్ దుర్గం రోజా, గోశాల కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెంచుకున్నాం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసినప్పటికీ ఓటింగ్ శాతం పెంచుకున్నామని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీకి ఓటింగ్ పెరగడంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి పరాజయం చెందాడని అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడారు. బీజేపీ ప్రయోజకరమైన సంక్షేమ పథకాలనే మేనిఫెస్టోలో పొందుపరిచినప్పటికీ ప్రజలలోకి తీసుకెళ్లడంలో తాము వైఫల్యం చెందామన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సఫలమైందన్నారు. అంతే కాకుండా కేసీఆర్‌పై కోపంతో ఆపార్టీకి ప్రజలు పట్టం కట్టారనీ, ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసిన కొత్త ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఓటమిపై విశ్లేషణ చేసుకొని వచ్చే స్థానిక సంస్థలు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్‌కుమార్, పగడాల కాళీప్రసాద్‌రావు, కన్నబోయిన రాజయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి దంపతులు భక్తులకు మహా అన్నదానం చేశారు. సాయంత్రం ఆకాశదీపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈఓ వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు నాగభూషణంశర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యాలపై పట్టింపేది?


ప్రహరీ మధ్యలో ఉన్న ఖాళీ స్థలం

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యాలపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని మారుమూల అటవీ గ్రామమైన కొడిశెల గిరిజన ఆశ్రమ పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. కొన్నేళ్ల నుంచి కనీసం 100 ఫీట్ల ప్రహరీ నిర్మాణానికి అధికారుల నిధులు మంజూరు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం వరదల సమయంలో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో కోశాపూర్ మినీ గురుకుల విద్యార్థులను కొడిశెల ఆశ్రమ పాఠశాలకు తరలించారు. పిల్లలను పరామర్శించేందుకు అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్, ఐటీడీఏ పీఓ అంకిత్, జిల్లా అధికారులు కొడిశెల పాఠశాలకు వెళ్లారు. ఆ సమయంలో సత్యవతి రాథోడ్ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నేటికి కనీసం 100 ఫీట్ల ప్రహరీ నిర్మాణానికి నోచుకోలేదు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఐటీడీఏకే పరిమితమవుతున్నారు తప్పా పాఠశాలను సందర్శించి సౌకర్యాలు కల్పించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

మల్హర్: తాడిచర్ల కేడీసీ (సహకార సంఘం) బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ వెంకటరాజం శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ అందిస్తున్న సేవలు, డిజిటల్ బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, చిన్న చిన్న పొదుపుతో ఎలా కుటుంబాన్ని మెరుగుపర్చుకోవడం, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, సీసీ నాగరాజు, సురేష్, శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

రేగొండ: కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఎంపీడీఓ సురేందర్ అన్నారు. మండలంలోని రూపిరెడ్డిపల్లి, చెన్నాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ తనిఖీ చేసి తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. అరబెట్టిన ధాన్యమును కొనుగోలు కేంద్రంలో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మెరుగైన వసతులను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. గన్ని సంచుల కొరత లేకుండా ముందస్తుగా నిర్వాహకులు సిద్ధం చేసుకోవాలని, లారీల్లో ధాన్యం మిల్లులకు తరలించే ఏర్పాట్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. ఎంపీడీఓ వెంట మండల పంచాయతీ అధికారి రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు


బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ద్వారకపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహన డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించి పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడతారన్నారు. ప్రమాదాలు సంభవిస్తే, ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ మహేందర్, టీఎస్ఎస్‌సీ కానిస్టేబుళ్లు ఉన్నారు.

సఖి కేంద్రాన్ని వినియోగించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

శాయంపేట : సఖి కేంద్రం అందించే సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి టీం లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ కేంద్రంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. హింసకు గురవుతున్న చిన్న పిల్లలకు, మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181, ఫోన్ నెంబర్ 0870–2452112కు ఫోన్ చేయాలన్నారు. ఏపీఎం శ్రీధర్ రెడ్డి, కేసు వర్కర్ వినీల మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై విద్యార్థినులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మ గూడెం గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలల్లో శుక్రవారం ఎస్పీ ఆధ్వర్యంలో షీ టీం మహిళా పోలీసు విభాగంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సునంద మాట్లాడుతూ.. బాలికలకు, మహిళలకు ఆపద సమయంలో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. బాలికలు అవసరమైన ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తమ ఫొటోలను, వ్యక్తిగత విషయాలను షేర్ చేయొద్దని, సైబర్ సెక్యూరిటీ సేవలు 1930కు ఫోన్ చేయాలన్నారు. షీ టీం వాట్సాప్ నంబర్ 87126 56935, 79011 42009 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జె.మొగిలయ్య, షీ టీం ఏఎస్సై ఆనందం, పీసీలు అరుణ, పార్వతి, రమేష్, భరోసా సభ్యులు మౌనిక పాల్గొన్నారు.